క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 7గంటలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, వివిధ విభాగాల అధికారులతో కలసి పరిష్కరించనున్నట్లు బీఆర్ఎస్ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. భరత్‌నగర్ వాటర్ ట్యాంక్ నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర భరత్‌నగర్ ఈడబ్ల్యూఎస్, శక్తి నగర్, మహేశ్వరినగర్, లచ్చయ్యనగర్, అంబేడ్కర్‌నగర్, బాబూ జగ్జీవన్‌రామ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీల ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శుభాకాంక్షలు



రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులైన పార్లమెంట్ సభ్యుడు గడ్డం సీతా రంజిత్‌రెడ్డిని ఆమె నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ఫతేనగర్ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ డివిజన్‌కు చెందిన 50 మంది బీజేపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరుగుతోందన్నారు. గత పాలకులు ఎంత ప్రయత్నించినా కాని బాలానగర్ ఫ్లై ఓవర్, దిల్‌కుష్‌నగర్ రోడ్లు నిర్మించి.. 24 గంటల విద్యుత్, మంచినీరు సరఫరా చేస్తున్నామన్నారు.

నియామకం

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లికి చెందిన పాతూరి వెంకటరావును తెలంగాణ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదివారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. టీటీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన 67వ హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఇంటర్ ఖైరతాబాద్ జోన్ లెవెల్ స్కూల్ కబాడీ, ఖోఖో టోర్నమెంట్స్ 2023, 24 గేమ్స్ విజేతలకు ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. సైఫాబాద్ కాలేజీ గ్రౌండ్స్‌లో గత రెండు రోజులుగా జరిగిన పోటీల్లో విద్యార్థులు వారి ప్రతిభను కనబర్చారు. పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

వడ్డెర భవన్‌కు ఓబన్న భవన్‌గా నామకరణం చేయాలి

రహమత్‌నగర్: ప్రభుత్వం నిర్మించబోయే వడ్డెర భవనానికి వడ్డె ఓబన్న భవన్‌గా నామకరణం చేయాలని తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి ఆదివారం స్థానిక వడ్డె ఓబన్న విగ్రహం వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... అనాదిగా వెనుకబాటులో ఉన్న వడ్డెర కులస్తులను గుర్తించిన సీఎం కేసీఆర్ వడ్డెర భవనం కోసం ఉప్పల్‌లో స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల వడ్డెర జాతి హర్షం వ్యక్తం చేస్తున్నదన్నారు. ఈ నెల 30 భూమిపూజ నిర్వహించే వడ్డెర భవన్‌కు స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న పేరుపెట్టాలని సీఎం కేసీఆర్‌ను ఆయన కోరారు. వడ్డెర ఐక్య వేదిక నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నగర మహిళ అధ్యక్షురాలు మేఘన పద్మ, ఒర్సు మల్లయ్య, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల పాలనలో అంతా అవినీతే.!

మహారాష్ట్ర ఎమ్మెల్యే అమిత్ సతమ్ ఘాటు వ్యాఖ్యలు





బూత్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న పన్నాల హరీష్‌రెడ్డి, పాల్గొన్న బీజేపీ నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తొమ్మిదేళ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి కాకపోగా ప్రభుత్వ భూములు కాబ్జాకు గురయ్యాయని మహారాష్ట్ర అంధేరి వెస్ట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అమిత్ సతమ్ ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిశీలకులుగా వచ్చిన ఆయన 10రోజుల పాటు నియోజకవర్గంలోని వివిధ వర్గాలతో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. అదివారం మేడ్చల్ జిల్లా అర్బన్ బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు.

◆ అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 10 రోజుల పాటు కార్యకర్తలను కలుస్తూ పార్టీ స్థితిగతులను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ అధికార దుర్వినియోగం, కాబ్జాలు విషయాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. తొమ్మిదేళ్లలో ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని తెలుపుతూ వాల్‌పోస్టర్ ద్వారా వివరించారు.

◆ ఎమ్మెల్యే అమిత్ సతమ్ మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత కూకట్‌పల్లిలో అసైన్డ్ భూములు, పార్కులు, కుంటలు, అనేవి తేడా లేకుండా కాబ్జాలకు గురైన విషయం తెలిసిందన్నారు. ఎక్కడికి వెళ్లినా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసి దోపిడీ చేస్తోందని ప్రజలే చెబుతున్నారని పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యేపై వ్యతిరేక నినాదాలు చేస్తూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఎమ్మెల్యేను ఇంటికి పంపి బీజేపీని గెలిపిస్తామని అన్నీ వర్గాల ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు.

◆ ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్, సెన్సార్ బోర్డు మెంబర్ సుధ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎనుగుల తిరుపతి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రావు, కార్పొరేటర్ మహేందర్, మాజీ ఫ్లోర్ లీడర్ దాసరి శంకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, నాయకులు సత్యమూర్తి, రవికుమార్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ అక్రమాలపై ఆగ్రహం

కూకట్‌పల్లి: అటల్‌జీ భవనంలో ఎమ్మెల్యే ప్రవాస్ కార్యక్రమంలో భాగంగా అంధేరి వెస్ట్ ఎమ్మెల్యే అమిత్ సతమ్ ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అధికార పార్టీ చేస్తున్న అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యారావు, సూర్యప్రకాష్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కార్పొరేటర్ మహేందర్, ముమ్మారెడ్డి ప్రేమకుమార్, రాష్ట్ర., డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

అట్టడుగు స్థాయిలో శేరిలింగంపల్లి అభివృద్ధి

బీజేపీ కార్యవర్గ సభ్యుడు గజ్జల యోగానంద్



రామకృష్ణనగర్, ఆర్‌పీనగర్‌లలో పాదయాత్ర చేస్తున్న గజ్జల యోగానంద్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యలపై పాదయాత్రలో భాగంగా 65వ రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గ వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్, ఆర్‌పీనగర్‌లలో శేరిలింగంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యోగానంద్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలలోని సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణనగర్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని.. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు.

◆ రాష్ట్రంలోనే అధిక పన్నులు చెల్లిస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి అట్టడుగు స్థాయిలో ఉందని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళితబంధు, దళితులకు మూడు ఎకరాల భూమి, వృద్ధులకు పెన్షన్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఏ పథకాలను సక్రమంగా అందజేయలేదన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రజలు అధికారంలోకి తీసుకువస్తారని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు విద్యాకల్పన, ఏకాంత్‌గౌడ్, మనోజ్, అశోక్, భాస్కర్‌రెడ్డి, ముత్యాలు, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి, కలాం పార్కుల ప్రారంభం

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నం.1లో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కు, పవర్‌నగర్‌లో ఏపీజే అబ్దుల్ కలాం పార్కులను ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీషతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధులు, దేశానికి సేవలు అందించి గొప్ప నేతల పేర్లు చిరస్మరణీయంగా, చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఉండాలనే ఆకాంక్షతో వారి పేర్లను పార్కులకు పెట్టామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, సమత, శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, జశ్వంత్, పిడికిలి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ విఫలం



బస్తీ భరోసా యాత్రలో గడప గడపకు తిరిగి కరపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలమయ్యారని టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, దండుగుల యాదగిరి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రజాప్రతినిధులకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం 5వరోజు బస్తీ భరోసా యాత్రలో భాగంగా కల్యాణ్ థియేటర్, కుమ్మరి బస్తీ, బడే మసీద్, బడేగూడ, ఓల్డ్‌బోయిన్‌పల్లి లాస్ట్ బస్టాఫ్ ప్రాంతాల్లో పర్యటించారు. గడప గడపకు వెళ్లి పార్టీ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పారెడ్డి, గోపిశెట్టి రాఘవేందర్, తూము వేణు, తూము సంతోష్, అస్లాం, విజయలక్ష్మి, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సొబగులు

సొంత నిధులతో వసతులు కల్పించిన ఎమ్మెల్యే

పంజగుట్ట: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో లేవని ఆయన తీసుకొచ్చిన 62 పథకాలు రాష్ట్రంలోని మహిళామణులకు వరంలాంటివని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వేరేపార్టీ నాయకులకు ఇప్పుడు ప్రజలు గుర్తుకు వస్తారని వారు బస్తీల్లోకి రాగానే ఇన్ని సంవత్సరాలుగా ఏం చేశారని ప్రశ్నించాలని ఆయన సూచించారు. గాంధీతాతా నగర్‌లో శిథిలంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను దానం సొంత నిధులతో పూర్తిగా ఆధునికీకరించి ఆదివారం తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో ఈ అంగన్‌వాడీ సెంటర్‌లో 52 వేల విద్యుత్ బిల్లు బకాయి ఉండగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో దానం తన సొంత నిధులతో విద్యుత్ బకాయిలు చెల్లించి, సెంటర్‌ను పూర్తిగా ఆధునికీకరించారు. స్థానికులు టాయిలెట్స్, మంచినీటి సరఫరా కావాలని అడగగా వెంటనే రెండు రోజుల్లో పనిపూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. పైన మరో అంతస్తు కావాలని కోరగా ఎమ్మెల్యే నిధులతో త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బస్తీ అధ్యక్షుడు కరుణాకర్, వెంకట్ రెడ్డి, బాలరాజు యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేందర్ బాబు, మెట్టురాజు, జహంగీర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

లయన్ వెంకటరావుకు మదర్ థెరిస్సా విశిష్ట అవార్డు



అవార్డును అందుకుంటున్న లయన్ కెల్లా వెంకటరావు

మోతీనగర్: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మదర్ థెరిస్సా లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అల్లాపూర్ డివిజన్, శ్రీవివేకానందనగర్‌కు చెందిన లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ శాఖ అధ్యక్షుడు కెల్లా వెంకటరావుకు కేంద్రమాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, దైవజ్ఞశర్మలు మదర్ థెరిస్సా విశిష్ట అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. తాను లయన్స్ క్లబ్‌లో సాధారణ సభ్యుడిగా చేరి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. తన సేవలను గుర్తించి మదర్ థెరిస్సా విశిష్ట సేవ అవార్డును అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

క్రైం కార్నర్..

హాస్టల్‌లో ల్యాప్‌టాప్, ఐ ఫోన్ చోరీ


వెంగళరావునగర్: హాస్టల్‌లో ఉంటున్న ఓ యువకుడి ల్యాప్‌టాప్, ఐ ఫోన్ చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీకి చెందిన రెడ్డి విజయ లవకుమార్ ఎల్లారెడ్డిగూడలోని లక్ష్మీగణేష్ మెన్స్ ఎగ్జిక్యూటివ్ హాస్టల్‌లో హెచ్‌ఆర్ రిక్రూటర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 24న ఓ యువకుడు అతని రూములో జాయిన్ అయ్యాడు. 26న రాత్రి యధావిధిగా పడుకున్న లవకుమార్‌కు ఉదయం లేచి చూసేసరిగా అతని వాచ్, ల్యాప్‌టాప్, ఐ ఫోన్ కనిపించలేదు. అతనితో పాటు రాత్రి నిద్రించిన యువకుడు, తనకు చెందిన బ్యాగ్, ఇతర వస్తువులు కూడా లేవు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళతో అసభ్యకర ప్రవర్తన: యువకుడి అరెస్టు

వెంగళరావునగర్: ఇల్లు ఖాళీ చేయమన్నందుకు మహిళ పట్ల అసభ్యంగా వ్యవహరించిన యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్‌లో ఉంటున్న యాదిరెడ్డి, రెబకా దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి చెందిన ఇల్లు నాల్గవ అంతస్తులో రవీంద్ర అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. ఇటీవల రవీందర్ గదికి అతని స్నేహితులు తరచూ వస్తున్నారు. దాంతో విసుగుచెందిన రెబకా కిరాయిదారుడైన రవీందర్ గదికి వెళ్లి పరిచయం లేనివారిని రప్పించవద్దని చెప్పారు. అయితే రవీందర్ ఆమెతో తగవు పెట్టుకుని దుర్భాషలాడాడు. విషయం తెలుసుకున్న రెబకా కుమార్తె రవీందర్ వ్యాఖ్యలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అతను మరింతగా రెచ్చిపోయి తన దుస్తులను పూర్తిగా విప్పి వారికి చూపించాడు. దానిని కూడా చిత్రీకరించిన తల్లీ కుమార్తెలు మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ సన్నద్ధం

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో 632 టీచర్ పోస్టులు ఖాళీ



సాక్షి, మేడ్చల్ జిల్లా : డీఎడ్, బీఎడ్ పూర్తి చేయడంతోపాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణులైన వారు ఏళ్లుగా ఎదురుచూస్తున్న టీఆర్టీ (టీచర్స్‌రిక్రూట్‌మెంట్ టెస్ట్)పై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటన చేయడంతో ఉద్యోగార్థుల్లో ఆశలు చిగురించాయి. దీనికి సంబంధించిన జీవో కూడా ఆర్థికశాఖ జారీ చేయడంతో మరింత స్పష్టత వచ్చింది.

ఆరేళ్ల నిరీక్షణకు తెర..

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 2017లో టీఆర్టీ నిర్వహించారు. ఆ తర్వాత నియామకాలు చేపట్టకపోవడంతో అభ్యర్థుల్లో నిరుత్సాహం నెలకొంది. గతేడాది ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల పక్రియ ప్రారంభించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఆ ప్రక్రియ అనంతరం నియామకాలు చేపడతారని భావించారు. అయితే..కోర్టు కేసుతో నిలిచిపోవటం, నియామకాలకు అడ్డంకిగా మారిందని పేర్కొనటంతో ఆశలు ఆవిరయ్యాయి. కోర్టులో బదిలీల కేసు వాయిదా పడుతుండటం, ఎన్నికలు సమీపిస్తుండటంతో విశ్వాసం సన్నగిల్లింది. టెట్ ప్రకటన ఇచ్చినప్పటికీ ఎన్నికల ముందు టీఆర్టీ వేయరని అనుకున్నారు. కానీ మంత్రి ప్రకటనతో హర్షం వ్యక్తమవుతోంది.

గ్రేటర్‌తో సహా శివారుల్లో ఉపాధ్యాయ ఖాళీలు 632

గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఆయా విద్యాశాఖ కసరత్తు చేస్తున్నాయి. అందులో భాగంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలను విద్యాశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో మొత్తంగా ఉపాధ్యాయ పోస్టులు 632 ఖాళీగా ఉండగా, ఇందులో స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు 189, ఎస్‌జీటీ పోస్టులు 325, భాషాపండితుల పోస్టులు 89, పీఈటీల పోస్టులు 29 ఉన్నాయి. జిల్లాల వారిగా ఇలా ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 25,ఎస్‌జీటీలు 45, భాషా పండితులుడు, పీఈటీలు ఒకటి ఖాళీగా ఉండగా, రంగారెడ్డి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 48,ఎస్‌జీటీ 117, భాషా పండితులు 25, పీఈటీలు ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, హైదరాబాద్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు 116, ఎస్‌జీటీలు 163, భాషాపండితులు 57, పీఈటీలు 22, పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మైనార్టీల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తాం

• ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ



కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మైనార్టీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీలకు మైనార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యేలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ముస్లిం సమాజం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. మైనార్టీ పాఠశాలలను నెలకొల్పి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. షాదీముబారక్, రంజాన్ తోఫా ఇస్తున్నారని గుర్తు చేశారు. ఎల్లమ్మబండలో అత్యంత ఆధునీకరమైన ఈద్గాను అభివృద్ధి చేస్తామన్నారు. అన్ని వసతులతో ఎల్లమ్మబండలో ముస్లిం శ్మశానవాటికను నిర్మించామని తెలిపారు. మైనార్టీ ఫంక్షన్‌హాళ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా ముస్లిం శ్మశానవాటికలను నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. మైనార్టీల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే మాధవరంకు శుభాకాంక్షలు..

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గానికి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి పనులే తిరిగి మూడోసారి ఆయన విజయానికి దోహదపడతాయని బీఆర్ఎస్ నాయకుడు నార్లపురం నాగరాజు అన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన నేపథ్యంలో ఆదివారం ఆయన ఎమ్మెల్యేను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ, వెంకటేష్, సైదులు, చిన్న వీరన్న పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్‌తో మానవ సంబంధాలు కనుమరుగు

• బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



యువభారతి సాహితి సంస్కృతి సంస్థ వజ్రోత్సవాల్లో పాల్గొన్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మోతీనగర్: ఆధునిక సమాజంలో మితిమీరిన టీవీ, స్మార్ట్‌ఫోన్ సంస్కృతితో మానవ సంబంధాలు రోజురోజుకూ కనుమరుగవుతున్నాయని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకర మఠం ఆవరణలో శాంత వసంత ట్రస్టు యువభారతి సాహితి సంస్కృతి సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా సాహితి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మానవ మూలాలు మరుగున పడే ప్రమాదం గోచరిస్తుందన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యంగా ఈనాటి యువతకు శ్రీరామచంద్రుని మహోన్నత వ్యక్తిత్వంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువభారతి చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఫణీంద్ర, కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, కోశాధికారి రవీంద్ర, వ్యవస్థాపక సమావేశకర్త వంగపల్లి విశ్వనాథం, సమావేశకర్త పత్రి అశ్వినికుమార్, వజ్రోత్సవ సమన్వయకర్త నాగేశ్వరరావు, శంకరమఠం పరిపాలనాధికారి సీఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఈఎంయూఎన్ నాల్గో ఎడిషన్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రముఖులు

శేరిలింగంపల్లి: విద్యార్థుల ఎపిస్టెమో మోడల్ యునైటెడ్ నూషన్స్ (ఈఎంయూఎన్) నాలుగవ ఎడిషన్ కార్యక్రమం ఆకట్టుకుంది.నల్లగండ్లలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాన్ని పర్యావేరణ వేత్త, స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ ఐశ్వర్యబుగ్గన చేతుల మీదుగా ప్రారంభించారు. యునైటెడ్ నేషన్ హ్యూమన్ రైట్ కౌన్సిల్, యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా కమిటీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాయింట్ క్రైసిస్ కమిటీ, ఇంటర్నేషనల్ ప్రెస్ వంటి కమిటీలను విద్యార్థులు వేసుకొని పలు అంశాలపై లోతైన చర్చలు జరిపారు. ముఖ్యంగా పలు దేశాల సరిహద్దు నేరా సమస్యలు, జాత్యాహంకారం, జాతి వివక్ష, జెనోఫిబియా, సంబంధిత అసహనాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై చర్చించారు. మూడ్రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో మొదటిరోజు ప్రసంగాలు, రెండవ రోజు నృత్య, లైవ్‌మ్యూజిక్‌తో విద్యార్థులు ప్రతిభచాటారు. మూడవ రోజైన ఆదివారం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వైస్ ప్రిన్సిపల్ పద్మకొల్లి, వాణిమత్రి, పలువురు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ మృతి

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



లక్ష్మీనారాయణ (ఫైల్)



లక్ష్మీనారాయణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ అక్కెనపల్లి లక్ష్మీనారాయణ ఆదివారం మృతి చెందారు. కూకట్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పడిన సమయంలో లక్ష్మీనారాయణ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అంతకు ముందు వార్డు మెంబర్‌గా కూడా పలు సేవలు అందించారు. అదే విధంగా 2000 సంవత్సరంలో కూడా కౌన్సిలర్‌గా విజయం సాధించారు. మూసాపేటకు చెందిన లక్ష్మీనారాయణ ప్రజా సేవకుడిగా ఎంతో కాలం పనిచేశారు. మూసాపేట పరిధిలోని అన్ని బస్తీల్లో ఆయనకు వ్యక్తిగత సంబంధాలతో పాటు మంచి పరిచయాలు ఉన్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.